క్లుప్తంగా

10న మినీ జాబ్‌మేళా

జంగారెడ్డిగూడెం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ – స్కిల్ ఏపీ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఈ నెల 10వ తేదీన బుట్టాయగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (సీడాప్), జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, టీం లిస్, జేగ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు పాల్గొంటారని, నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కుక్కునూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని శనివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి పరిశీలించారు. మండలంలోని కుక్కునూరు , చిరవెల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, కుక్కునూరు కస్తూర్బా, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, మాధవరం రేషన్ షాపు, గొపరాజుగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని భోజన పథకంలో చిన్న, చిన్న లోపాలను గమనించి వాటిని సరిచేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని వేగవరం శివారులో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాల ప్రకారం కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం నుంచి అశ్వారావుపేట వెళుతున్న పాలవ్యాన్ వేగవరం వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా రోడ్డుమీదకు వచ్చిన వ్యక్తిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న బొట్టా ఉదయ్‌కిరణ్, దుర్రమోతి సతీష్‌కుమార్, బైసే అజయ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

కామవరపుకోట: రైతుల అభ్యున్నతి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ కడిమి రమేష్ అన్నారు. జలకళ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న మోటార్లను, 30 మంది రైతులకు ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్ శనివారం అందజేశారు. ఎంపీడీవో కె.శ్రీదేవి, వైస్ ఎంపీపీ కనికెళ్ల రత్నకుమారి, జీలకర్రగూడెం సొసైటీ చైర్మన్ పెద్దబ్బాయి, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ పోలిమెట్ల ప్రశాంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వరిపైరుకు మాగుడు తెగులు

లింగపాలెం: మండలంలోని పలుగ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి పైరును ఏరువాక శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ కె ఫణికుమార్, డి సుజాత మాట్లాడుతూ ప్రస్తుతం వరిపైరుకు మాగుడు లేదా పాచి తెగులు వ్యాపించినట్లు తెలిపారు. మరికొన్ని పైరులకు గోధుమరంగు మచ్చ తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. మాగుడు లేదా పాచితెగులు నివారణకు యక్సాకాంజోల్ మందు ద్రావణాన్ని 1 లీటర్ నీటిలో 0.2 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. గోధుమరంగు మచ్చ తెగులు నివారణకు మ్యాంగోజెబ్ మందు ద్రావణాన్ని 1 లీటర్ నీటిలో 0.2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ షాపు యజమానికి బురిడీ

జంగారెడ్డిగూడెం: ఆటోమొబైల్ షాపు యజమానిని ఓ వ్యక్తి బురిడీ కొట్టించి రూ.99 వేలు కాజేశాడు. ఈ ఘటన శనివారం జంగారెడ్డిగూడెంలో జరిగింది. దీనిపై ఎస్సై ఆర్ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వంకదారి రామకృష్ణకు పట్టణంలో ఆటోమొబైల్ షాపు ఉంది. షాపునకు ఒక వ్యక్తి వచ్చి సామాను కొనుగోలు చేశాడు. సదరు వ్యక్తి ఒక ఫోన్ నెంబర్ ఇచ్చి ఆ నెంబర్‌కు రూ.1 ఫోన్‌పే చేయాలని షాపు యజమాని రామకృష్ణను అడగ్గా, ఫోన్‌పే చేశాడు. అనంతరం ఒక నంబర్‌కు కాల్ చేసుకోవాలని అడుగగా రామకృష్ణ ఇవ్వడంతో అతని సెల్ నుంచి రూ.99 వేలు కాజేశాడు. వంకదారి రామకృష్ణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

జంగారెడ్డిగూడెం: ఆధునిక సాంకేతికత విస్తృతమవుతున్న తరుణంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, దీని నుంచి రక్షణ పొందాలంటే ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు విద్యార్థులకు సూచించారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఫ్యూచర్ చాలెంజెస్ అండ్ అపర్చునిటీస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అనే అంశం మీద చర్చించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ మెంబర్ ఎం.వెంకటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్, ఫౌండర్ ఎండ్‌నౌ ఫౌండేషన్ అనీల్ రాచమళ్ళ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇ-మెయిల్ మొబైల్ హకింగ్స్ ఏవిధంగా జరుగుతాయి, వాటిని నివారించాలంటే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలు తెలిపారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రతే లక్ష్యం


ద్వారకాతిరుమల: ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి


జంగారెడ్డిగూడెం రూరల్: పేరంపేటలో మందులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


కుక్కునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, సౌకర్యాలను పరిశీలించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఊరూరా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి, ఆర్భాటాలు, ప్రచారాలను మాత్రమే చేసిందన్నారు. ప్రభుత్వ సేవలను లబ్ధిదారుల గడప వద్దకు చేర్చిన ఘనత తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర, సర్పంచ్ యంత్రపాటి సునీల్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోయపాటి మోహన్‌రావు, నల్లూరి బాపనయ్య, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి సీతారామయ్య, తూంపాటి భీమేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తిరుపతిరావు, తహసీల్దార్ పి.సతీష్ తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిర్వాసితులకు లబ్ధి

కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మారుమూల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. శనివారం సరిపల్లి గ్రామంలో తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పోలవరం నిర్వాసితులైన కొత్తూరు గ్రామస్తులను ఆరోగ్య పరీక్షల కోసం ఎంవీఆర్ విద్యా సంస్థ సౌజన్యంతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులద్వారా రెవెన్యూ శాఖ ఆధ్వర్యాన తీసుకువచ్చారు. సుమారు రెండు వందల మందికి పైగా వైద్య సదుపాయం పొందేలా కృషి చేసినందుకు ప్రిన్సిపాల్ రవిప్రకాష్‌ని ప్రభుత్వ అధికారులను ప్రజాప్రతినిధులు అభినందించారు. శిబిరంలో 318 మంది వైద్యసేవలు పొందగా 17 మందిని మెరుగైన ఆరోగ్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వ ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి కె.విజయకృష్ణ తెలిపారు. సోమవారం కన్నాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు.

పేరంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

జంగారెడ్డిగూడెం రూరల్: పేరంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు కేటాయించి అనేక కార్యక్రమాలు చేబడుతుందన్నారు. సర్పంచ్ కంకిపాటి లక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా సెక్రటరీ కఠారి సీతా రాంబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ల శ్రీనివాసరెడ్డి, కఠారి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణే ధ్యేయం

లింగపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణే సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ధ్యేయమని రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు అన్నారు. మండలంలోని భోగోలు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా మందులు, కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నాయకులు ఇనుగంటి చిన్న రంగారావు, గణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ యడ్ల మోహన్‌రావు కోరారు. మండలంలోని యండపల్లి సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు నిపుణులు పీహెచ్‌సి వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాగా తహసీల్దార్ కృష్ణ జ్యోతి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుత్తా కిషోర్, ఎంపీడీఓ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కుక్కునూరు: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల నాయకులు రాయి సత్యనారాయణ అన్నారు. శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మరేడుబాక సచివాలయ పరిధిలో జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, రాయి రవి, సర్పంచ్ మడివి రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లంకపాకలలో జగనన్న ఆరోగ్య సురక్ష

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన లంకపాకల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ కారం శాంతి, తహసీల్దార్ ఎస్ఎస్ శాంతి, సర్పంచ్ కె.లక్ష్మి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈఓపీఆర్‌డీ శ్రీహరి, వైద్యులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

టి.నరసాపురం: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో ఎండి రజావుల్లా తెలిపారు. ఏపుగుంట గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. డెంగి, మలేరియా, బీపీ, షుగర్ వంటి 9 రకాల రక్త పరీక్షలు నిర్వహించి 150 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు రజావుల్లా తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఆపరేషన్ల కొరకు సిఫార్సు చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంగా కుమారి, సర్పంచ్ శ్రీదేవి, వైద్యాధికారులు ఫణీంద్ర బాబు, ఆంజనేయులు, బాలాజీ, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళ్ళచెరువులో 348 మందికి వైద్య పరీక్షలు

కామవరపుకోట: మండలంలో కళ్ళచెరువు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 348 మంది వైద్య సేవలు పొందగా, 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ రోగులకు మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, సర్పంచ్ నౌడు శ్రీదేవి సత్తిబాబు, ఎంపీటీసీ వెళ్ళంకి మనోరమ వాసు, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, డాక్టర్ సునీల్ వర్మ, ఎంఈఓ చిన్నం ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వైద్యసేవలు


పోలవరం రూరల్: కొత్తపట్టిసీమలో వైద్యసేవలను పరిశీలిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో సచివాలయాల వద్ద వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకే వైద్యసేవలు తీసుకురావడం జరిగిందన్నారు. వివిధ వ్యాధులతో బాధపడేవారికి ఉచితం పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నామన్నారు. పేదలు ఆసుపత్రికి వెళ్లాలంటే తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొనేవారని, అటువంటి పరిస్థితి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉపశమనం కల్పించిందన్నారు. వైద్యసేవలతో పాటు శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా హెల్త్ సెంటర్‌లు కూడా ఏర్పాటు చేసి వైద్యసేవలను మరింత చేరువ చేశారన్నారు. ఈ శిబిరంలో 480 మందికి వైద్యాధికారులు చికిత్స అందించి అవసరమైన వారికి మందులు కూడా అందజేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వైద్యాధికారులు టి.సాయి సునందదేవి, పి.మురళి, పి.రేణుక, సీహెచ్ తేజ, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: సరిపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరానికి పోటెత్తిన ప్రజలు


లింగపాలెం: భోగోలులో మందులు అందజేస్తున్న దృశ్యం


బుట్టాయగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


టి.నరసాపురం: ఏపుగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్న దృశ్యం


కామవరపుకోట: కళ్ల చెరువులో మందులు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్

సాగుభూములను ఆన్‌లైన్ చేయాలి


ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

టి.నరసాపురం: అల్లంచర్ల రాజుపాలెం గ్రామంలో శనివారం రైతులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సాగు భూములకు సబ్ డివిజన్ చేసి ఆన్‌లైన్ చేయాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 2005లో భూపంపిణీ చేసిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్నప్పటికీ ఆన్‌లైన్ లేక ప్రభుత్వం నుంచి అందే రైతు భరోసా వంటి రాయితీలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ములకయ్య, దుర్గారావు, శారద, రాంబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో గడపగడపకు


అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని కొండ్రుకోట పునరావాస కేంద్రంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తేనే సంక్షేమ సుపరిపాలన సాధ్యమన్నారు. నాలుగున్నరేళ్లల్లో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి, వాటి వల్ల పేదలకు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. పునరావాస కేంద్రంలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా

పునరావాస కేంద్రంలో నిర్వాసితులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై బాలరాజు స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను మండల స్థాయి అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పైదా నాగరాజు, ఎంపీటీసీ మాడే ఆనంద్, ఐటీడీఏ డీఈ శ్రీనివాసరావు, కార్యదర్శి అప్పారావు, పలుశాఖల అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహాసభ


జంగారెడ్డిగూడెంలో ఆదివాసీ మహాసభ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, గిరిజన వీరుడు పోలవరం మండలం కొరుటూరు గ్రామానికి చెందిన కోరుకొండ సుబ్బారెడ్డి 165వ వర్ధంతి అక్టోబర్ 7వ తేదీన ఏటా పోలవరం నిర్వాసితుల హక్కుల పోరాట దినంగా పాటించాలని ఆదివాసి మహాసభ ఏలూరు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం పత్రికా సమావేశం నిర్వహించారు. లీగల్ అడ్వైజర్ అయి నారపు సూర్యనారాయణ కారుకొండ సుబ్బారెడ్డి జీవిత చరిత్రను వివరిస్తూ బుట్టాయిగూడెం, యర్నగూడెం, పోలవరం ప్రాంతాలలో బ్రిటీష్ వారి నిరంకుశ పరిపాలన ఎదిరించి ఉరి తీయబడ్డారని వివరించారు. ఆదివాసి మహాసభ ఏలూరు జిల్లా అధ్యక్షులు మిడియం వెంకటస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి మిడియం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూలం రాంబాబు, ఆర్ జాకబ్, తదితర సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

చింతలపూడి: ఈనెల 12, 13 తేదీల్లో ఏలూరులో నిర్వహిస్తున్న రైతు సంఘం జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాఘవాపురం శివారు అంకులయ్య కొత్తగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రైతు సదస్సులో వారు మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని, భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు రూ.18వేత ధర ప్రకటించాలని, కొబ్బరి గొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యం క్వింటాలుకు రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ సదస్సుకు గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఘంటా పాపారావు, అనుమోలు మురళీ, రైతులు చీకటి వెంకటేశ్వరరావు, జి.సీతారామయ్య, మట్టా సత్యనారాయణ, చీకటి ఉమారాణి, కరెడ్ల అన్నం, జి.కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని ఆందోళన

కొయ్యలగూడెం: కన్నాపురం గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలంటూ శనివారం స్థానికులు జొన్నకూటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మహాదేవపురం రెవెన్యూ పరిధిలోగల సర్వే నంబర్ 45/6 లోగల ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొని పూరి గుడిసెలను నిర్మించుకున్నారు. ప్రభుత్వం తమను గుర్తించి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు పట్టాలు అందజేసి పక్కా గృహాలను నిర్మించాలని వారు కోరారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇల్లు లేని దళిత పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న స్పందించని కారణంగా సదరు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవలసి వచ్చిందని జొన్నకూటి వెంకటేశ్వరరావు తెలిపారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చండీహోమం

జంగారెడ్డిగూడెం: స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక సమీపంలో ఉన్న దత్త ఆశ్రమంలో శనివారం చండీ హోమం నిర్వహించారు. తొలుత దత్త స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అర్చక స్వాములు వేదోక్తంగా చండీహోమ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంట వివరాలు ఈ-కేవైసీ చేయించుకోవాలి


పోలవరంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీ వై.రామకృష్ణ

పోలవరం రూరల్: ఖరీఫ్‌లో పంట వివరాలను తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ జేడీ వై.రామకృష్ణ అన్నారు. పోలవరంలో క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదుపై ఆయన పరిశీలించారు. వరి, మినుము పంటలను పరిశీలించారు. పంట వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ-క్రాప్ నమోదు సాగు చేస్తున్న రైతులు వారి పేరు మీద ఈక్రాప్ నమోదు అయ్యిందా లేదా పరిశీలించారు. జలాధారం వివరాలు, విస్తీర్ణం, ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు, ఏ పంట , ఏ రకం సాగు చేస్తున్నారు, సాగు పద్ధతులను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఏ విధమైన పొరపాట్లు జరగకుండా పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈయన వెంట మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఖరీఫ్ సాగు చేసుకునే రైతులు తమ పంట వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ రామకృష్ణ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అలాగే ఆర్ఓఎఫ్ఆర్ సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఏఓ బి.సుమలత, వ్యవసాయ సహాయకురాలు వి.దుర్గాదేవి, రైతులు పాల్గొన్నారు.